సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 9 । జూన్ । 2025



బాబు మార్కు రాజకీయానికి బలి!

సుగవాసి బాలసుబ్రమణ్యం తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పడంతో.. చంద్రబాబు నా యుడు రాజకీయంలో మరో నేత బలయ్యారు.

-8లో



నలుగురు 'ఎర్ర' స్మగ్లర్లు అరెస్టు

తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసులు ఆదివారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 48 ఎర్రచందనం దుంగలు, ఒక బైక్‌కు స్వాధీనం చేసుకున్నారు.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.140	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 890 మెట్రిక్ టన్నులు



ఆ మాటలు.. నీటిమూటలు

- మదనపల్లె ప్రాంతంలో టమాటా ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ఊసే లేదు
- గాలిలో దీపంలా రైల్వేకోడూరులో పరిశ్రమల ఏర్పాటు
- గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి విస్మరించిన చంద్రబాబు, పవన్‌లు



సాక్షి రాయచోటి: అధికారంలోకి రావడం కోసం అడ్డమైన హామీలు ఇచ్చి...తీరా వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం పాలకులకు పరిపాటిగా మారింది. ఏదో చేస్తామని...ఏదేదో ఇస్తామని మాటల గారడీతో బురిడీ కొట్టించి తీరా హామీలు ఇప్పుడు ఒక్క అడుగు పడడం లేదు. స్థానిక ప్రజల ఆశలు, ఆకాంక్షలే పెట్టుబడిగా..ఓట్లు వేయించుకున్న కూటమి పెద్దలు ఇప్పుడు నోరు మెదపడం లేదు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వంద రోజులు దాటుతున్నా ఇప్పటికీ హామీలపై అతీగతీ లేదు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, టీడీపీ నాయకుడు నారా లోకేష్, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌లు ఎన్నికలకు ముందు రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె తదితర ప్రాంతాల్లో పర్యటించారు. బహిరంగసభల్లో ప్రజలకు మేము అది చేస్తాం..ఇది చేస్తామంటూ చెప్పినా నేటికీ హామిలుగానే మిగిలిపోయాయి. వైఎస్ జగన్ సర్కార్ హయాంలో సంక్షేమం ,అభివృద్ధి పరుగులు పెట్టాయి. నిధుల వరద పారడంతో ఎక్కడ చూసినా పనులు వేగంగా కదిలే పరిస్థితులు కనిపించాయి. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమాన్ని గాలికొదిలేశారు. సూపర్ సిక్స్ అమలు దిశగా అడుగులు పడకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం, డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అప్పట్లో ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలిపోతున్నాయి.

» రాయచోటిలో మైనార్టీ జూనియర్ కళాశాల ఏదీ?

జిల్లా కేంద్రమైన రాయచోటి ప్రజలకు న్యాయం చేస్తామని, ముస్లిం మైనార్టీలు అధికంగా ఉన్న ఈ ప్రాంతానికి సంబంధించి చిన్నమండెంలో మైనార్టీ జూనియర్ కళాశాల ఏర్పాటుచేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే ఆ విషయంగా ఇప్పటికీ ముందుకు అడుగులు పడలేదు. అంతేకాకుండా సాగునీటి ప్రాజెక్టులైన ఝరికోన, శ్రీనివాసపురం పూర్తి చేస్తామన్నా ఇంకా వైఎస్సార్ సీపీ హయాంలో ఏ మేరకు పనులు జరిగాయో అంతవరకే ఉన్నాయి. అభివృద్ధి జాడ కనిపించకపోవడంతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కూడా డీలా పడిపోయింది.


మదనపల్లెలో ఏదీ టమాటా ప్రాసెసింగ్ యూనిట్

జిల్లాలోని మదనపల్లెలో మార్కెట్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని ఒకసారి, ఈ ప్రాంత రైతులకు సంబంధించి టమాటా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పి కష్టాలు తీరుస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దతిప్పసముద్రం వద్ద ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ అన్న మాటలు ఇప్పటికీ అమలుకు కార్యచరణ కనిపించలేదు. అలాగే మదనపల్లెలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఫ్లై ఓవర్ నిర్మిస్తామని టీడీపీ అధినేత హామీ ఇచ్చారు. కడప–బెంగళూరు రైలు మార్గం పనులు కూడా అధికారంలోకి రాగానే వేగవంతం చేస్తామని చెప్పినా నేటికీ అతీగతీ లేదు. మదనపల్లెను జిల్లా కేంద్రం చేసి పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తానన్న ప్రస్తుత ముఖ్యమంత్రి దీనిపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. మదనపల్లె ప్రజల దాహార్తి తీర్చేందుకు సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల నిర్మాణానికి పూనుకుంటామని చెప్పినా ఇప్పటికీ పునాది రాయి పడలేదు.

రాజంపేటలో మెడికల్ కళాశాలకు మోక్షం లేనట్లేనా..

జిల్లాలోని మదనపల్లెలో వైఎస్‌జగన్ సర్కార్ హయాంలో మెడికల్ కళాశాలను మంజూరు చేసి భవన నిర్మాణాన్ని కూడా వేగంగా చేపట్టారు. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే ప్రాజెక్టును గాలికి వదిలేసింది. పైగా 2024–25 ఏడాదికి సంబంధించి మంజూరైన సీట్లను కూడా ఇక్కడ రద్దు చేసి సిబ్బందిని కూడా ఇతర ప్రాంతాలకు పంపించారు. ఉన్న మెడికల్ కళాశాలకు సంబంధించి పీపీ విధానంలో అందించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై మదనపల్లె ప్రాంతంలో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోప్రక్క ఎన్నికల సందర్భంగా రాజంపేటలో కూడా మెడికల్ కళాశాల తీసుకొస్తామని అప్పట్లో ప్రకటించినా ఆ దిశగా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క అడుగు కూడా పడలేదు. ఏది ఏమైనా కూటమి సర్కార్ ఎన్నో హామిలు ఇచ్చినా అమలుకు చర్యలు తీసుకునే పరిస్థితులు కనిపించడం లేదు.

» అన్నమయ్య డ్యాం ఎప్పుడు?



అధికారంలోకి రాగానే జిల్లాలోని రాజంపేటను జిల్లా కేంద్రంగా చేస్తామని చంద్రబాబు నోట ఓట్ల పర్యటనలో హామీ వచ్చింది. అంతేకాకుండా వరదలకు కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టడంతోపాటు వరద బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నా ఇప్పటివరకు దీనికి సంబంధించి కార్యచరణ ప్రారంభం కాలేదు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వరద బాధిత గ్రామాల్లో పర్యటించడం మినహా అన్నమయ్య డ్యాంకు సంబంధించి అడుగులు ముందుకు పడలేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో డ్యాంకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించి టెండర్ల వరకు వెళ్లినా కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే వాటిని కూడా విస్మరించారు. ప్రాజెక్టు లేకపోవడంతో ఆయకట్టు రైతులు పంటలు వేసుకోలేక అల్లాడిపోతున్నారు.

హామీ అమలు చేయాలి



అన్నమయ్య డ్యాం నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వం చేసిన హామీ ఏమైంది. ఏడాది పూర్తయింది. గత సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేటకు చంద్రబాబు వచ్చిన సందర్భంగా అన్నమయ్య జలాశయం నిర్మాణం పూర్తి చేసి, ఆయకట్టుకు నీరందిస్తామని ప్రగల్భాలు పలికారు. ఇప్పుడు ఆ మాటలు నీటి మూటలుగా మారిపోయాయని రాజంపేట వాసులు భావిస్తున్నారు.వెంటనే హామీ అమలు చేయాలి.

–పొపినేని విశ్వనాథరెడ్డి,
జిల్లా అధికారప్రతినిధి, వైఎస్సార్‌సీపీ, రాజంపేట

» పరిశ్రమల ఏర్పాటు కలేనా..



రైల్వేకోడూరు కేంద్రంలో మూతపడిన అప్పాపండ్ల రసాల పరిశ్రమను తెరిపిస్తామని..రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అప్పట్లో చెప్పినా ఆచరణలో కనిపించడం లేదు. అంతేకాకుండా బొప్పాయి, మామిడి, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చారు. అందులో ఒక్కటి కూడా ఏర్పాటు కాలేదు. ఈసారి మామిడి పంట దిగుబడి తగ్గిపోయి ధరలు లేక అల్లాడిపోతున్నా కూటమి సర్కార్ ఆదుకునే దిశగా అడుగులు వేయలేదు. కనీసం పరిశ్రమల స్థాపన లేకపోగా, మంగంపేట లాంటి పెద్ద ప్రాజెక్టును సద్వినియోగం చేసుకుని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేని స్థితి నెలకొంది. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో మామిడితోపాటు అరటి, బొప్పాయి పంటలు విస్తారంగా పండిస్తున్న నేపథ్యంలో కూటమి పెద్దలు ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తామని మాటల గారడి చేసినా పునాది రాయి పడడం లేదు. పండ్ల తోటల రైతులు మాత్రం ఎదురుచూస్తున్నారు.

ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి



మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని, బీటీ కళాశాలను యూనివర్సిటీగా మారుస్తామని, కడప–బెంగళూరు రైల్వేలైను మదనపల్లె మీదుగా తీసుకువస్తామని,హామీలు ఇచ్చారు. అయితే కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

– పునీత్,
బహుజన్ యువసేన అధ్యక్షుడు, మదనపల్లె

తాళ్లపాకలో 9న యోగాంధ్ర కార్యక్రమం

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: తాళ్లపాకలోని అన్నమయ్య సన్నిధిలో ఈనెల 9న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు, తిరుమలేశునిపై 32వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్య నడయాడిన నేలలో ఆయన పేరుతో జిల్లా ఏర్పడిందని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది మే 9న 617 వసంతాలు పూర్తి చేసుకున్న అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకొని ఆయనను స్మరిస్తూ తాళ్లపాకలోని ఆయన విగ్రహం వద్ద సోమవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు 617 మందితో యోగాసనాలు వేయనున్నట్లు తెలిపారు. తిరుమలేశునిపై 32వేల సంకీర్తనలు రచించిన అన్నమయ్యకు నివాళిగా జిల్లా వ్యాప్తంగా 32 వేల మందితో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించే విషయంపై అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మీడియా మిత్రులు, ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



యోగా చేస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

» నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

కిలో టమాట రూ.22

బి.కొత్తకోట: నిన్నటిదాక ధరల పతనంతో అతలాకుతలం అయిన టమాట రైతులకు ఆదివారం ఊరట కలిగించే ధరలు పలికాయి. ఉమ్మడి జిల్లాలో కీలకమైన మదనపల్లె మార్కెట్‌లో గరిష్ట ధర కిలో రూ.22.7 పైసలు పలకగా, కనిష్ట ధర కిలో రూ.18, మోడల్ ధర కిలో రూ.21 పలికింది. ములకలచెరువు మార్కెట్‌లో కనిష్ట ధర కిలో రూ. 15, గరిష్ట ధర కిలో రూ.12, మోడల్ కిలో రూ.13 పలికింది. పుంగనూరు మార్కెట్‌లో కనిష్ట ధర కిలో రూ. 15.40 పైసలు, మోడల్ ధర కిలో రూ.12.70 పైసలు, గరిష్ట ధర కిలో రూ.14 పలికింది. పలమనేరు మార్కెట్‌లో గరిష్ట ధర కిలో రూ. 14.60 పైసలు, మోడల్ ధర కిలో రూ.12, కనిష్ట ధర కిలో రూ.13 పలికింది. మదనపల్లె మార్కెట్‌కు 990 టన్నులు, ములకలచెరువు మార్కెట్‌కు 80, పుంగనూరు మార్కెట్‌కు 791.32, పలమనేరు మార్కెట్‌కు 440.64 టన్నుల టమాట విక్రయానికి వచ్చింది.

మాన్యువల్ విధానంలోనే బదిలీలు జరపాలి

కడప ఎడ్యుకేషన్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలను మాన్యువల్ విధానంలోనే జరపాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. లేకపోతే ఎంతదూరమైనా పోవడానికి సిద్ధమని ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశాయి.ఎస్జీటీలకు వెబ్ కౌన్సెలింగ్ వద్దు..మ్యానువల్ ముద్దు అనే నినాదంతో ఆదివారం ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు కడపలోని డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు.మాన్యువల్ కౌన్సెలింగ్ జరపాలనే ఏకైక నినాదంతో జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కార విషయమై గతంలో సంఘాలు ధర్నాకు పిలుపు ఇచ్చినప్పుడు కమిషనర్ మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ జరుపుతామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పుడు మాట తప్పి ఆన్‌లైన్ ద్వారా కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని ప్రకటించడం సబబుగా లేదన్నారు. గతంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

11న రాజంపేటలో ఢిల్లీరైలుకు హాల్టింగ్

రాజంపేట: రాజంపేట రైల్వేస్టేషన్‌లో ఈనెల 11న ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రైల్వే అధికారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డిని ఆహ్వానించారు. ఆదివారం ఆకేపాటి ఎస్టేట్‌లో ఆయనను కలిసి ఆహ్వానపత్రికను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రవాణశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరామిరెడ్డి గోపాల్‌రెడ్డి, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, పీ.చంద్రశేఖర్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్. జడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి, డిప్యూటీ చైర్మన్ జకియాఖాన్, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ఢిల్లీ రైలు స్టాపేజి కార్యక్రమానికి హాజరవుతరన్నారు. ఆకేపాటిని కలిసిన వారిలో గుంతకల్ రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, కడప కమర్షియల్ సూపర్‌వైజరు జనార్థన్, రాజంపేట స్టేషన్‌మేనేజరు గోపాల్ తదితరులు ఉన్నారు.



ఆకేపాటికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న రైల్వే అధికారులు

ఏపీఈఏపీసెట్‌లో మెరిశారు

మదనపల్లె సిటీ: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ప్రవేశ పరీక్ష (ఏపీఈఏపీ)లో జిల్లాకు చెందిన విద్యార్థులు చక్కని ప్రతిభ చూపారు. ఉత్తమ ర్యాంకులు సాధించి పలువురి ప్రశంసలు పొందారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలి ఉంది



మహమ్మద్ ముదసిర్

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలని ఉందని ఏపీఈఏపీసెట్ ర్యాంకర్ ఎం.ఎ. మహమ్మద్‌ముదసిర్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో 105 ర్యాంకు దక్కించుకున్నారు. మదనపల్లె పట్టణం ఇందిరానగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మహల్ ప్యారేజాన్, మోహతాజ్ కుమారుడు ముదసిర్ విజయవాడ చైతన్య కాలేజీలో చదివారు. చిన్నప్పటి నుంచి చదువులో రాణించేవాడు. ఇంటర్మీడియట్ ఎంపీసీలో 979 మార్కులు సాధించాడు. జెఈఈ మెయిన్స్‌లో 99.935 పర్సంటైల్ మార్కులు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 412 ర్యాంకు సాధించాడు.

'కంప్యూటర్ ఇంజినీరింగ్ చేస్తా:



రిషంత్‌రెడ్డి

కంప్యూటర్ ఇంజినీరింగ్ చేస్తానని దయ్యాల రిష్యంత్‌రెడ్డి అన్నారు. ఏపీఈఏపీసెట్–25 ప్రవేశ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 377 ర్యాంకు సాధించాడు. మదనపల్లె సరస్వతినగర్‌కు చెందిన పెంచుపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, సుప్రజల కుమారుడు రిషంత్‌రెడ్డి విజయవాడ నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివాడు. ఇంటర్మీడియట్‌లో ఎంపిసిలో 984 మార్కులు సాధించాడు. జెఈఈ అడ్వాన్స్‌లో 5056 ర్యాంకు వచ్చింది.

మెరిసిన కృష్ణహర్షిత్



తల్లిదండ్రులతో కృష్ణహర్షిత్

ఏపీ ఈఏసీ సెట్ ఫలితాల్లో కడప ఎన్‌జీఓ కాలనీకి చెందిన మంచాల కృష్ణ హర్షిత్ రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకును సాధించి మెరిశాడు. మంచాల ఈశ్వర్, రాధికల కుమారుడు కృష్ణహర్షిత్ ఇటీవల విడుదలైన ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో కూడా 197వ ర్యాంకు సాధించాడు. చెన్నై ఐఐటీలో ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసి..సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నతోద్యోగం సాధించడమే లక్ష్య మని పేర్కొన్నాడు. కృష్ణహర్షిత్ తండ్రి మంచాల ఈశ్వర్ సిద్దవటం మండలం మాధవరం జెడ్పీ హైస్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్నాడు.

శభాష్..వేద వర్షిత్



మొరుంపల్లె వేద వర్సిత్ రెడ్డి

కురబలకోట: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో కురబలకోట మండలం మద్దిరెడ్డిగారిపల్లెకు చెందిన మొరుంపల్లె సహదేవరెడ్డి కుమారుడు వేదవర్సిత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో 403 ర్యాంకు సాధించాడు.సహదేవరెడ్డి కొన్నేళ్లుగా మదనపల్లెలోని నీరుగట్టివారిపల్లెలో బ్రిలియంట్ స్కూల్ నిర్వహిస్తున్నారు. పది వరకు అక్కడే చదివాడు.ఇంటర్ తిరుపతి నారాయణ జూనియర్ కళాశాలలో చదివారు. 985 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.ఐఐటీ చదవాలన్నది తన ధ్యేయమన్నాడు.

క్లుప్తంగా

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలంలో జరిగింది. తుంగవారిపల్లెకు చెందిన రమణమ్మ (40), ఆమె భర్త రమణ(50), అదే గ్రామానికి చెందిన అమరమ్మ(55)తో కలిసి అంగళ్లలో జరిగిన మహిళా సమాఖ్య సమావేశానికి వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా అంగళ్ల మార్కెట్ వద్ద ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తను లేదని.. తనువు చాలించాలనుకున్నాడు

మదనపల్లె రూరల్ : భార్య మృతిని తట్టుకోలేక మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం ములకల చెరువు మండలంలో జరిగింది. దేవలచెరువుకు చెందిన సమీవుల్లా (26) గత నెల 21వ తేదీన భార్య అమ్మజాన్(21) కుమార్తె సుఫియా(ఆరు నెలలు)తో కలిసి ద్విచక్ర వాహనంలో వస్తుండగా పెద్దపాలెం గేటు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అమ్మజాన్, సుఫియాలను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అమ్మాజాన్ మృతి చెందింది. సుఫియాకు చికిత్స పూర్తి అయిన తర్వాత ఇంటికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో సమీవుల్లా రోడ్డు ప్రమాదంలో భార్యను కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక మనస్తాపంతో ఇంటివద్దే పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు కుతుబుద్దీన్

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన కుతుబుద్దీన్ (40) అనే వ్యక్తి విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి పట్టణం రవిహాల్ వెనుక భాగంలో నివాసం ఉండే కుతుబుద్దీన్ రోజు వారి కూలికి వెళతాడు. వచ్చిన కూలి డబ్బులతో పూటుగా మద్యం తాగేసి కుటుంబాన్ని పట్టించుకొనేవాడు కాదు. దీంతో చేసేది లేక అతని భార్య తన నలుగురు పిల్లలతో కలసి వేరుగా కాపురం ఉంటోంది. దీంతో మనస్థాపానికి గురై శనివారం రాత్రి మద్యంతో పాటు విషద్రావణం తాగి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. ప్రాథమిక చికిత్స చేస్తుండగానే మృతి చెందాడు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది సోషియల్ మీడియాలో ఫొటో పెట్టి సమాచారం తెలియజేశారు. ఆదివారం సాయంత్రం ఆచూకీ తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏరువమ్మ గుడిలో చోరీ


బీరువాను పగులకొట్టి చీరలు కిందపడేసిన దృశ్యం

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీ రాచపల్లి సమీపంలో ఉన్న ఏరువమ్మ దేవత గుడిలో శనివారం రాత్రి చోరీ చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నాగభూషణం అనే వ్యక్తి ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి పూజలు చేసేందుకు వెళ్లగా ఆలయం తాళాలు పగులకొట్టి గుడిలో ఉన్న బీరువాను సైతం పగులగొట్టారు. అమ్మవారి మెడలో ఉన్న ఆభరణాలు బంగారం కాదని తెలుసుకుని అక్కడే పడేసి వెళ్లారు.


బాబు మార్కు రాజకీయానికి.. ఆ ముగ్గురు బలి!

- యూజ్ అండ్ త్రో పాలిట్రిక్స్
- రాజంపేటలో ఇన్‌చార్జి రగడ
- క్యాడర్‌లో అధిష్టానంపై సన్నగిల్లుతున్న నమ్మకం


పసుపులేటి బ్రహ్మయ్య


బత్యాల


సుగవాసి



రాజంపేట : గత సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఓటమిపాలై, పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొని..ఇన్‌చార్జి పదవి విషయంలో అధిష్టానం వెనకడుగు వేసిన తరుణంలో ఆయన ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడంతో.. చంద్రబాబు రాజకీయంలో మరో నేత బలయ్యారనే వాదన ఆ పార్టీ క్యాడర్‌లో వినిపిస్తోంది. దివంగత మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు బాటలో సుగవాసి కూడా చేరిపోయారనేది ఇప్పుడు కూటమి వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

యూజ్ అండ్ త్రో పాలిట్రిక్స్..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాలానుగుణంగా రాజకీయాలు చేస్తారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఉంది. వాడుకోవడం పక్కన పెట్టడం, విభజించి పాలించడం లాంటి విధానాలతో రాజంపేట టీడీపీ వర్గ విభేదాలకు నిలయంగా మారిపోయిందని రాజకీయ పరిశీలకుల భావన. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకున్న నేతలను తన కష్ట కాలంలో బాగానే ఉపయోగించుకున్నప్పటికి, అందలమెక్కిన తర్వాత వారిని డస్ట్‌బిన్‌లో వేసే విధానం పార్టీ ఆవిర్భావం నుంచి రాజంపేట టీడీపీలో కొనసాగుతోందన్న విమర్శలున్నాయి.

అయ్యో.. పసుపులేటి బ్రహ్మయ్య..

రాజంపేట తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో వెలుగు వెలిగిన నేత బలిజ సామాజికవర్గానికి చెందిన పసుపులేటి బ్రహ్మయ్య. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తోపాటు చంద్రబాబునాయుడు పాలనలో ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అపార అనుభవం కలిగిన నేత. 1994, 1999లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2012 ఉప ఎన్నికల్లో ఓటమిపాలవుతారని తెలిసి కూడా, పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఎవ్వరూ ముందుకురాకపోతే పసుపులేటి బ్రహ్మయ్య పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. అన్ని విధాలుగా నష్టపోయారు. మానసికంగా ఆందోళనకు గురయ్యారు. ఆ తర్వాత అనారోగ్యంతో మృతి చెందారు. అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రహ్మయ్య గురించే పట్టించుకోలేదన్న అంశం బహిరంగ అంశం. ఆయన వర్గీయులు చెట్టుకొకరు పుట్టకొకరు పోయారు. ఆయన తనయులకు రాజకీయంగా చంద్రబాబు సరైన ప్రాధాన్యత ఇవ్వలేదనే వాదన ఉంది.

రాజకీయ ప్రయోగంలో బత్యాల బలి..

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలో బలిజ సామాజిక వర్గాల్లో పట్టుకల్గిన నేత బత్యాల చెంగల్రాయుడు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో బత్యాల చెంగల్రాయుడుకు ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టారు. ఆ పదవి తప్ప మరో పదవి రాలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నుంచి టీడీపీ తరఫున పోటీ చేసే నాథుడు కరువైన దుస్థితిలో రైల్వేకోడూరు నుంచి బత్యాలను తీసుకొచ్చి రాజంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయించారు. వైఎస్సార్‌సీపీ చేతిలో ఘోరంగా ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత బత్యాల రాజంపేట రాజకీయాలకు దూరమయ్యారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రైల్వేకోడూరుకే బత్యాలను పరిమితం చేశారు.

అధిష్టానంపై సన్నగిల్లుతున్న నమ్మకం..

టీడీపీకి పనిచేసిన సీనియర్లకు, కార్యకర్తలకు అధిష్టానం వైఖరిపై నమ్మకం సన్నగిల్లుతోంది. తమను వాడుకోవడమే కానీ, తమకు చేసేదేమీలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పసుపులేటి బ్రహ్మయ్య, బత్యాల చెంగల్రాయుడు, సుగవాసి బాల సుబ్రమణ్యంలు రాజకీయ వ్యవహారంలో సమిధలుగా మారిన తీరుతెన్నులను తమ్ముళ్లు నిశితంగా పరిశీలిస్తున్నారు. రాజంపేటలో టీడీపీకి బలిజ సామాజిక వర్గం అండగా ఉంటూ వస్తోంది. అయితే ఇప్పుడు ఆ సామాజిక వర్గనేతలకు జరుగుతున్న అన్యాయాన్ని బలిజలు దిగమింగుకోలేకున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ పార్టీ రాదన్న ఆందోళన, టీడీపీకి వస్తున్న ప్రజావ్యతిరేకతను చూసి తమ్ముళ్లు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇన్‌చార్జి ఫైనల్‌పై అధిష్టానం కసరత్తు..

టీడీపీ ఎన్నికల అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం గుడ్‌బై చెప్పడంతో రాజంపేట టీడీపీ వర్గాలు కుదేలయ్యాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదికే టీడీపీకి షాక్ తగిలే సరికి అధిష్టానం ఉలిక్కి పడిందని కొందరు నేతలు అంటున్నారు. ఇన్‌చార్జి విషయంలో తేల్చాలనే నిర్ణయానికి అధిష్టానం వచ్చేసింది. ఇప్పటికే ఇన్‌చార్జి రేసులో చమర్తి జగన్‌మోహనరాజు, మేడా విజయశేఖర్‌రెడ్డి ఉన్నారు. తాజాగా బత్యాలకే ఇన్‌చార్జి ఇవ్వాలని, చమర్తి రాజకీయాన్ని వ్యతిరేకిస్తూ తమ్ముళ్లు ఆత్మీయ సమావేశాలు పెట్టుకొని అధిష్టానానికి అల్టిమేటం ఇస్తున్నారు. ఎవరంతట వారు తమ నేతకే ఇన్‌చార్జి అని చెప్పుకుంటున్నారు. మరోవైపు ఇన్‌చార్జి కుర్చీ రెడ్డి సామాజికవర్గానికి అప్పగించాలని టీడీపీ అధిష్టానం అడుగులు వేస్తోందనే ప్రచారం ఆ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

ఆటో, రెండు బైకులు ఢీ

ఒకరి మృతి


నుజ్జునుజ్జు అయిన ఆటో


మృతి చెందిన రత్నం

రాజంపేట : రాజంపేట పట్టణ బైపాస్‌రోడ్డులో హెచ్‌పీ పెట్రోలు బంక్ సమీపంలో ఆటో, రెండు బైకులు ఆదివారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కడపకు చెందిన రత్నం (50) అనే వ్యక్తి మృతి చెందారు.. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 ద్వారా ప్రాంతీయవైద్యశాలకు తరలించారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని తిరుపతికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో ఇళ్ల సమీపంలో పశువధ కేంద్రం గుర్తింపు


పశువధ కేంద్రంలో స్వాధీనం చేసుకున్న కోడెదూడలు, ఆవులు


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఆవులు, కోడెదూడలు గోశాలకు తరలింపు

మదనపల్లె రూరల్ : మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ ఎర్రగానిమిట్ట వద్ద టిడ్కో ఇళ్లకు ఉత్తరం వైపున ఉన్న పాత కోళ్లఫారం షెడ్డులో రహస్యంగా పశువులను వధిస్తున్న విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. శానిటోరియం వద్ద ఆవును వధిస్తున్నారనే సమాచారం మేరకు..స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కోళ్లఫారం షెడ్ వద్దకు చేరుకున్నారు. జంతు వధశాలను గుర్తించి సమాచారం ఉన్నతాధికారులకు చేరవేశారు. వారి ఆదేశాలతో తాలూకా పోలీసులు అక్కడకు చేరుకుని వధించేందుకు సిద్ధంగా ఉన్న 6 కోడెదూడలు, 1 దేశవాళీ ఆవు, 4 జెర్సీ ఆవులను గమనించి, వాటిని అక్కడి నుంచి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ లోపు విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, వి.నారదరెడ్డి, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ నాయకులు షెడ్ వద్దకు చేరుకున్నారు. బక్రీద్ సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీస్ కమిటీ సమావేశంలో...డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ..గోవధ జరగకుండా చూస్తామని, దీనిని అరికట్టేందుకు డివిజన్ పరిధిలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారన్నారు. అయితే ఎవ్వరికీ అనుమానం రాకుండా గోవులను రహస్యంగా శానిటోరియం వద్దకు తరలించి, వధిస్తుంటే పోలీసులు ఎందుకు అరికట్టలేకపోయారని ప్రశ్నించారు. జంతు వధశాలలో స్వాధీనం చేసుకున్న గోవులను తీసుకువచ్చి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలపాలని బీజేపీ, వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు నిర్ణయించగా, పోలీసులు వారి ప్రయత్నాన్ని అడ్డుకుని పుంగనూరురోడ్డులోని నాగదేవత గోశాల ట్రస్ట్‌కు పశువులను తరలించారు. ఈ ఘటనపై తాలూకా సీఐ కళా వెంకటరమణ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్లకు సమీపంలో పశువధ జరుగుతోందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించగా కట్టివేసిన 10 పశువులను గుర్తించామన్నారు. పాత కోళ్ల ఫారం జాకీర్‌హుస్సేన్‌కి చెందినదిగా గుర్తించి, సుమోటోగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రాత్రి 8 గంటల సమయంలో బీజేపీ నాయకులు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గోహంతకులను అరెస్ట్ చేయాలని ధర్నాకు పూనుకోవడంతో పోలీసులు బండి ఆనంద్, వి.నారదరెడ్డి, భగవాన్, మోహన్ తదితరులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

48 దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం


నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తంబళ్లపల్లె : తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 48 ఎర్రచందనం దుంగలు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్కుఫోర్సు పోలీసుల కథనం మేరకు వివరాలు.. టాస్కుఫోర్సు డీఎస్పీ బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందంగా శనివారం అటవీశాఖ అధికారులు జయప్రసాదరావు, మోహన్‌రెడ్డి, సబీన్‌తాజ్‌ల సహకారంతో వేపూరికోట ఫారెస్టుబీట్ పరిధిలో డంపింగ్ పాయింట్లను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆదివారం తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె సమపంలోని వంకగట్టు వద్ద అనుమానాస్పదంగా పారిపోతున్న వారిని వెంబండించారు. ములకలచెరువు మండలం సోంపల్లి ఆర్.సుధాకర్(43), రాజుగారిపల్లెకు చెందిన ఈ.లక్ష్మీపతినాయుడు (27), పెద్దమండ్యం మండలం కురవపల్లెకు చెందిన మల్లికార్జున(39) గుర్రంకొండ మండలం మధ్యాహ్నంవారిపల్లెకు చెందిన సురేంద్రరెడ్డి (39) నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాలు తనిఖీ చేయగా 48 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని దీంతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రహదారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


రెండు వరుసల రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి టౌన్ : రహదారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర క్రీడలు, రవాణా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని కడప – రాయచోటి రింగ్ రోడ్డు వద్ద ఎన్‌హెచ్ 440, ఎన్‌హెచ్ 40 రోడ్ల రెండు వరుసల లింక్ రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి – వేంపల్లె లింక్ రోడ్డు పనులు, కడప, రాయచోటి లింక్ రింగ్ రోడ్డు పనుల కోసం రూ.11.07 కోట్లు ఖర్చుచేసి రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే వేంపల్లె రోడ్డులో ఆగిపోయిన పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. గువ్వల చెరువు ఘాట్‌లో టన్నెల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి గాయాలు
- రెండు గ్రామాల్లో ఉద్రిక్తత




రామసముద్రం మండలంలో ఘర్షణలో గాయపడిన వెంకటప్ప, కృష్ణమూర్తి

రామసముద్రం : రామసముద్రం మండలంలో రెండు గ్రామాల మధ్య శనివారం రాత్రి వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. పరస్పరం దాడులు చేసుకోవడంతో ఇరువర్గాల వారికి తీవ్ర గాయాలై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. తమ పొలంలో పనికి వచ్చే నిమిత్తం ఎరబ్రోయినపల్లికి చెందిన శాంతప్ప కుటుంబానికి ఆర్.నడింపల్లి పంచాయతీ శ్రీరాములపల్లికి చెందిన వెంకటప్ప రూ. 1.57 లక్షలు నగదు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. కానీ పనికి వెళ్లకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇచ్చేయమని వెంకటప్ప అడిగినా శాంతప్ప పట్టించుకోలేదు. ఈ విషయమై పలుమార్లు పెద్దమనుషులు పంచాయితీ చేశారు. ఈ వివాదం ఎమ్మెల్యే షాజహాన్ బాషా దృష్టికి తీసుకెళ్లగా ఎస్ఐకు చెప్పి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ మేరకు ఇరువర్గాల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ రవికుమార్ శనివారం రాత్రి ఇరువర్గాల వారిని పిలిపించి గొడవపడకూడదని సర్ది చెప్పి పంపించారు. అయితే ఇంటికి వెళ్తున్న నేపథ్యంలో ఎర్రబ్రోయినపల్లికి చెందిన శాంతప్ప తన వర్గీయుతో కలసి శ్రీరాములపల్లికి చెందిన వెంకటప్ప వర్గీయులను వెంబడించారు. తప్పించుకుంటూ శ్రీరాములపల్లికి వెళ్లగా వీరిపై కోనంగి వెంకటప్ప, అతని కుమారులు వెంకటరమణ, సుధాకర, విశ్వనాథ్, పక్కిలి గంగప్ప, కుమారుడు సోమశేఖర్, శ్రీనివాసులు, అరవింద్, సంతోష్, యస్వంత, రమేష్‌లు దాడి చేశారు. దీంతో ఇరువర్గాలు కర్రలు, కొడవళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దీంతో శ్రీరాములపల్లికి చెందిన వెంకటప్ప, వెంకటరమణ, కృష్ణమూర్తి, రామలక్షుమ్మలకు గాయాలు కాగా మరో వర్గానికి చెందిన ఎర్రబ్రోయినపల్లికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ చిన్నవెంకటప్ప, వెంకటరమణ యశ్వంత్, సుధాకర్, గంగాధర్, విశ్వనాథ్‌లు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం మదనపల్లె, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రులకు, కోలారు మెడికల్ ఆసుపత్రికి, బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. రామసముద్రం ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో మదనపల్లి, పుంగనూరు ఆసుపత్రులకు చేరుకుని ఘటనకు దారితీసిన కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చౌక దుకాణానికి వెళ్తూ ప్రమాదంలో గాయపడిన మహిళ

రాయచోటి : కూటమి ప్రభుత్వం తెచ్చిన కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ఇంటివద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని రద్దు చేసి డీలర్ల వద్దనే పంపిణీ చేయడంతో ప్రజలు కష్టాలు తిరిగి మొదలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో కిలోమీటర్ల దూరం వెళ్లి క్యూలైన్‌లో నిలబడి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల పంచాయతీ గొర్లకాడపల్లెకు చెందిన గొర్ల కాంతమ్మ (55) డీలర్ షాపు వద్దకు వెళ్తూ ప్రమాదానికి గురై ఆసుపత్రికి చేరింది. ఆదివారం మధ్యాహ్నం తమ గ్రామం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మోపాలకుంట గ్రామానికి బియ్యం సంచి చేతబట్టి బయలుదేరింది. ఇంతలో అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు బైకుపై వెళ్తుండగా తనను డీలర్ షాపువద్ద దింపాలని అడిగి ప్రయాణం సాగించింది. కొద్ది దూరం వెళ్లగానే బైక్ ప్రమాదానికి గురి కావడంతో గొర్ల కాంతమ్మ తీవ్రంగా గాయాలపాలైంది. విషయం తెలుసుకున్న స్థానికులు గాయపడ్డ కాంతమ్మను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యుల సలహా మేరకు తిరుపతికి రెఫర్ చేశారు.

రాష్ట్ర స్థాయి బాలికల హాకీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ


ప్రతిభ కనబరిచిన జిల్లా జూనియర్ బాలికల హాకీ జట్టు

మదనపల్లె సిటీ : పశ్చిమగోదావరి జిల్లా భీమరంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హాకీ పోటీల్లో జిల్లా జట్టు ప్రతిభ కనబరిచింది. ఫైనల్స్‌లో అనంతపురం, అన్నమయ్య జిల్లా జట్లు పోటీపడ్డాయి. అనంతపురం జట్టు 4–0 స్కోరుతో విన్నర్‌గా నిలవగా అన్నమయ్య జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. సెమీ ఫైనల్స్‌లో ప్రకాశం జట్టుతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. జట్టు మేనేజర్‌గా షాద్‌మాని వ్యవహరించారు. క్రీడాకారులను అన్నమయ్య జిల్లా హాకీ కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, పీడీ జలజ, కోచ్ నౌషాద్‌లు అభినందించారు.

సెల్ మోహన రంగా..!

అమెరికాలో ఉన్నా రాజంపేటలో ఉన్నట్లే..



నాపేరు అపర్ణ. మా సొంతూరు రాజంపేట. అమ్మా, నాన్న మొదటి నుంచి అమెరికాలో ఉంటున్నారు. నేను రాజంపేటలో ఉండే అమ్మమ్మ వద్ద పెరిగాను. అమ్మమ్మ చనిపోయాక నాకు వివాహం కావడంతో 25 ఏళ్లుగా అమెరికాలోనే స్థిరపడ్డాము. వాట్సాప్ అందుబాటులోకి వచ్చాక రాజంపేటలోని చిన్ననాటి మిత్రులమంతా కలిసి వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకున్నాము. అందువల్ల ప్రతిరోజు ఫ్రెండ్స్‌లో ఇద్దరు, ముగ్గురు వాట్సాప్‌లో మెసేజ్ చేయడం, వీడియో కాల్ చేసి మాట్లాడటం చేస్తుంటారు. అలాగే నేను కూడా నిత్యం మా ఫ్రెండ్స్‌లో ఒకరిద్దరికి వీడియోకాల్ చేసి మాట్లాడుతుంటాను. అందువల్ల నేను అమెరికాలో ఉన్నా రాజంపేటలో ఉన్నట్లు ఉంటుంది.

పంటలు, ధరల సమాచారం క్షణాల్లో..



నాపేరు ఆకేపాటి వరప్రసాద్‌రెడ్డి. నేను ఆదర్శ రైతును. రాజంపేట, రైల్వేకోడూరులకు చెందిన ముఖ్యమైన రైతులం కలిసి ఒక గ్రూపు ఏర్పాటు చేసుకున్నాము. ఎవరికైనా పంటల సాగులో ఇబ్బంది ఉన్నా లేక పంటను చీడపీడలు ఆశించినా గ్రూపులో సమాచారాన్ని పెట్టగానే నాకు తెలిసిన మేరకు సలహాలు, సూచనలు ఇస్తుంటాను. అలాగే మిగతా వారు కూడా వారికి తెలిసిన సలహాలు ఇస్తారు. ఇక చేతికొచ్చిన పంట ధరను తెలియచేస్తుండటం వల్ల ఎక్కువ ధర ఉన్న ప్రాంతానికి పంటను ఎగుమతి చేస్తున్నాము. వాట్సాప్ గ్రూపు వల్ల మేము ఎంతో ప్రయోజనం పొందుతున్నాము.

అంతా సెల్‌ఫోన్ మయం

- పలకరింపులు, యోగక్షేమాలు అన్ని సెల్‌ఫోన్‌లోనే
- దూరమవుతున్న దగ్గరి వాళ్లు
- దగ్గరవుతున్న దూరంగా ఉన్న వాళ్లు

రాజంపేట టౌన్ : సెల్‌ఫోన్ మనిషి జీవితంలో ఒక భాగమైపోయింది. ఎంతలా అంటే చేతిలోనో లేక జేబులోనో సెల్‌ఫోన్ లేకుంటే ఏదో పోగొట్టుకున్నంతగా ఫీల్ అయ్యేవారు కూడా ఉన్నారంటే ఆశ్చర్యం వేయక తప్పదు. పల్లె, పట్టణం, అక్షరాస్యులు, నిరక్షరాస్యులు అన్న తేడా లేకుండా నూటికి తొంభైఐదు శాతం మందికి పైగానే స్మార్ట్‌ఫోన్‌లు కలిగి వుంటారంటే అతిశయోక్తికాదనే చెప్పాలి. స్మార్ట్‌ఫోన్‌లో ఉండే వాట్సాప్, ఫేస్‌బుక్‌లు ఒక విధంగా సాంకేతిక విప్లవాన్ని సృష్టించడమే కాక హల్‌చల్ చేస్తూ మనిషిని అలజడికి గురి చేస్తున్నాయి. ప్రధానంగా వాట్సాప్ మానవీయ బంధాలను మరింత దగ్గర చేస్తుంది. ఇక ఫేస్ బుక్ విషయానికి వస్తే ఇక ఎప్పటికి కలవలేమేమో అనుకునే స్నేహితులను, బంధువులను ఫేస్‌బుక్ కలుపుతుంది.

దూరంగా ఉన్న వాళ్లు దగ్గరవుతున్నారు..

ఎప్పుడో చిన్ననాటి స్నేహితులు, దేశ విదేశాల్లో స్థిరపడిన దూరపు బంధువులు వాట్సాప్, ఫేస్‌బుక్ వల్ల దగ్గరవుతున్నారు. అనేక సంవత్సరాల పాటు ఒకరినొకరు చూసుకోని మిత్రులు, శ్రేయోభిలాషులు, దూరపు బంధువులు ఫేస్‌బుక్ ద్వారా దగ్గరవుతున్నారు. ఇలా దగ్గరైన వారిని వాట్సాప్ మరింత చేరువ చేస్తుంది.

పెరిగిన వాట్సాప్ వినియోగం..

వాట్సాప్ వినియోగం ఇప్పుడు బాగా పెరిగిపోయింది. ఎంతలా అంటే కూతవేటు దూరంలో ఉన్న బంధువులు, మిత్రులను కూడా వాట్సాప్ గ్రూపులోనే పలకరించుకోవడం, వివిధ విషయాల గురించి చాటింగ్ చేసుకుంటున్నారే కాని ఒకచోట కూర్చొని ఆత్మీయంగా మాట్లాడుకునే రోజులు పోయాయనే చెప్పాలి. ఈ కారణంగానే కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత కరువవుతుందన్న భావన అనేక మందిలో వ్యక్తమవుతుంది. పిల్లలు, యువతే కాక పెద్దలు కూడా సెల్‌ఫోన్ మత్తులో పడి సమయమంతా సెల్‌ఫోన్‌తోనే గడుపుతున్నారు. ఈ కారణంగా దగ్గరలో ఉండే బంధువులతో కూడా నార్మల్ కాల్‌లో మాట్లాడటం, వారిని చూడాలనుకుంటే వీడియోకాల్ చేసి చూస్తుండటంతో మనుషుల మధ్య ఆత్మీయతా అనురాగాలు దూరం అవుతున్నాయి.

అందరికి వాట్సాప్ గ్రూపులు..

స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరు వాట్సాప్‌కు సంబంధించి ఏదో ఒక గ్రూపులో సభ్యులుగా ఉంటున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుతం వాట్సాప్ గ్రూపుల యుగం నడుస్తుందనే చెప్పాలి. వాట్సాప్ అందుబాటులోకి వచ్చాక తొలుత మిత్రులు, బంధువులు వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసుకొని తద్వారా సమాచారాలు, వారికి సంబంధించిన విశేషాలు తెలుసుకునేవారు. అయితే వాట్సాప్ ద్వారా సమాచారం చేరవేయడం సులభం కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, ఒక గ్రామానికి చెందిన వారు, ఒక వీధికి చెందిన వారు, క్రీడాకారులు, కళాకారులు, వాకర్స్ ఇలా ప్రతి ఒక్కరు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని తద్వారా నిత్యం మెసేజ్‌ల ద్వారా ఒకరినొకరు పలకరించుకోవడం బాధలను, సంతోషాలను అన్ని విషయాలను వాట్సాప్‌లోనే పంచుకుంటున్నారు.

వాట్సాప్ వల్ల ప్రయోజనం ఉంది కానీ..



వాట్సాప్, ఫేస్‌బుక్ ఆత్మీయులను, బంధువులను, మిత్రులను దగ్గర చేస్తుంది. చాలా మంది సెల్‌ఫోన్‌కే ఎక్కువ సమయం కేటాయిస్తూ వాట్సాప్ లేకుంటే ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌లలో చాట్‌చేస్తూ గడుపుతున్నారు. ఈ ప్రభావం జీవితంపై పడే ప్రమాదం ఉంది.

– జి.భానుమూర్తిరాజు, ప్రాంతీయ వ్యాయామ విద్య, తనిఖీ అధికారి

సెల్‌ఫోన్ చూస్తే ఆరోగ్య సమస్యలు..



సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కళ్లు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదముంది. కొంతమంది తల్లులు తమ పిల్లలకు సెల్‌ఫోన్‌లో బొమ్మలు చూపిస్తూ ఆహారం తినిపిస్తున్నారు. ఇది శ్రేయస్కరం కాదు.

– డాక్టర్ మాధవరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట